ఘనంగా వాసవీ మాత జయంతోత్సవాలు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ పట్టణంలోని గడిమైసమ్మ ఆలయంలో శనివారం వాసవీ మాత జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మేడ్చల్ ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో గడిమైసమ్మ ఆలయంలో మహిళలు అమ్మవారికి అభిషేకం, సహస్ర పూర్వక అర్చనలు, సామూహిక కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షులు కొమురవెల్లి బద్రినారాయణ గుప్తా, మహిళా అధ్యక్షురాలు నీలిమ, పట్టణ అధ్యక్షులు రవిగుప్తా, వాసవి క్లబ్ అధ్యక్షులు రమేశ్, క్రిష్ణమూర్తి, తాళ్లపల్లి శివకుమార్, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ-మైసమ్మ ఆలయ వార్షికోత్సవం



మేడ్చల్‌రూరల్: మండలంలోని పూడూర్ గ్రామంలోని శివ్వంపేట పోచమ్మ- మైసమ్మ అమ్మవార్ల ఆలయ, బోనాల వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా గ్రామ మహిళలు పోచమ్మ – మైసమ్మ అమ్మవార్లతో పాటు కట్ట మైసమ్మ, దుర్గమ్మ, ముత్యాలమ్మ ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేసి అమ్మవార్లకు నీటి శాకలు పెట్టారు. అనంతరం పోచమ్మ ఆలయం వద్ద నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దీంతో గ్రామంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

కన్నుల పండువగా శ్రీవారి కల్యాణం



శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం కేశవరం గ్రామంలోని బాలాజీ వేంకటేశ్వర స్వామి కల్యాణం శనివారం కన్నుల పండువగా జరిగింది. ఉదయం నుంచే భక్తులు పెద్దఎత్తున ఆలయానికి తరలివచ్చారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య అలివేలు పద్మావతి వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిగింది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నక్కా ప్రభాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, ఎంసీపల్లి జెడ్పీటీసీ హరివర్ధన్‌రెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులుయాదవ్, గోనె మహేందర్‌రెడ్డితో పాటు మహిళలు, భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని నిరసన



ద్వారకానగర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని 18వ వార్డు ద్వారకానగర్ మినర్వ స్కూల్ వద్ద అవుట్‌లెట్ సక్రమంగా నిర్మించపోవడంతో మురుగు రోడ్డుపై పారుతోంది. స్థానిక కౌన్సిలర్ రవీందర్, మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్ ఆధ్వర్యంలో స్థానికులు శనివారం నిరసన చేపట్టారు. అధికారులు స్పందించి డ్రైనేజీ సమస్యను పరిష్కారించాలని, లేనిపక్షంలో ద్వారకానగర్ వాసులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన చేపడతామని హెచ్చరించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో శనివారం నిర్వహించిన చంద్ర కళానిలయం నాట్య గురువు పేరిణి సంతోష్ పెరుమాండ్ల శిష్య బృందంచే పేరణి, ఆంధ్ర నాట్యం ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. శివానీ, కృతి, శ్రద్ధ, రమ్య, ప్రగ్య, నిత్యశ్రీ, సహస్ర, హరిణి, శ్రీవల్లి, జాన్సీ ప్రదర్శనలో పాల్గొన్నారు.

శ్రీమాతా నిమిషాంబ దేవి ఆవిర్భావ దినోత్సవం

బోడుప్పల్: పెంటారెడ్డి కాలనీలోని శ్రీమాతా నిమిషాంబ దేవి అమ్మవారి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కామరౌతు వినోద్‌కుమార్ మాట్లాడుతూ అమ్మవారు బంగారం చీరెతో దేదీప్యమానంగా వెలుగు దివ్యల కాంతులతో దర్శనమిచ్చినట్లు తెలిపారు. రజిత కవచంపైన స్వర్ణం తాపడం చీరెతో అలంకరించినట్లు పేర్కొన్నారు. అలాగే మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం నిర్వహించిన చండీ హోమంలో ఆలయ ప్రధాన కార్యదర్శులు అశోక్‌కుమార్, శ్రీనివాస్, కోశాధికారి రమేశ్, రాష్ట్ర నకాష్ సంఘం ప్రధాన కార్యదర్శి కొరిచర్ల శ్రీనివాస్‌రావు , మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కలుషిత నీటితో చేపల మృత్యువాత



ఎదులాబాద్ చెరువులో మృత్యువాత పడ్డ చేపలు

ఘట్‌కేసర్: ఎదులాబాద్ శ్రీలక్ష్మీనారాయణ చెరువులో కలుషిత నీరు చేరడంతో వేలాది చేపలు మృత్యువాత పడ్డాయి. మూసీ జలాలు, రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌లోని రసాయన వ్యర్థాలు చెరువులో కలవడంతో నీరు కలుషితం అయినట్లు మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. సుమారు 600 వందల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువులోకి ఎరిమల్లెవాగు ద్వారా కలుషిత నీరు చేరిందని అంటున్నారు. గతంలో ఇటువంటి ఘటనలు జరిగాయని అధికారులకు, కలెక్టర్‌కు మొర పెట్టుకున్నా ఫలితం లేదన్నారు. అధికారులు స్పందించి పరిహారం చెల్లించి నీరు కలుషితం కాకుండా చూడాలని మత్స్యకారులు వేడుకుంటున్నారు.

కుప్పలు.. తిప్పలు



ఎదులాబాద్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలు

- నత్తనడకన సాగుతున్న కొనుగోళ్లు
- కేంద్రాల్లో మూలుగుతున్న ధాన్యం
- దాదాపు 20 రోజులుగా కేంద్రాల్లోనే..
- వర్షానికి భయపడుతున్న రైతులు
- వెంటనే స్పందించాలంటూ వినతి

ఘట్‌కేసర్: అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా మారింది అన్నదాతల పరిస్థితి. ధాన్యం కొనుగోళ్ల తీరు ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కి అన్నట్లు సాగుతోంది. కేంద్రంలో సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతో ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటి వరకు కూలీలు లేక ధాన్యం కొనుగోళ్లు ఆలస్యమయ్యాయి. ప్రస్తుతం కూలీలు అందుబాటులో ఉన్నా బ్యాగుల కొరత, తూకం వేసేందుకు సరిపోయేన్ని తూకం మిషన్లు లేకపోవడంతో 20 రోజులుగా ధాన్యం కుప్పల్లోనే మూలుగుతోంది. రెండు మూడు రోజులుగా వర్షంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు వాతావరణం మారిపోయి.. వర్షం కురుస్తోందనని ఆందోళన చెందుతున్నారు. నెల రోజులుగా ఎన్నికల బిజీలో ఉన్న అధికారులు, నాయకులు పట్టించుకోకపోవడతో ఆగమవుతున్నామని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యాసంగిలో 5–6 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని భావించినా ఇప్పటి వరకు కేవలం 1100 టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. మండలంలో మాదారం, ఎదులాబాద్, ప్రతాపసింగారం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుంది.

తూకం మిషన్లు తరచూ చెడిపోతున్నాయి

ఈ విషయమై డీసీఎంఎస్ ఇన్‌చార్జ్ మేనేజర్ వెంకట్‌రెడ్డిని వివరణ కోరగా బ్యాగులు కావాలని పౌర సరఫరా శాఖ అధికారులను కోరాం. డిమాండ్ అధికంగా ఉండటంతో బ్యాగులు సరిపోవడం లేదు. మార్కెట్ కమిటీ వారు అందజేసిన తూకం మిషన్లు తరచూ చెడిపోతున్నాయి. మరమ్మతులు చేయించి కొనుగోళ్లు కొనసాగిస్తామన్నారు.

తప్పని ఎదురుచూపులు..

ధాన్యం కుప్పలు పోసి 20 రోజులైనా రైతులకు టోకన్లు జారీ చేయడం లేదని అంటున్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో పని చేయడానికి ఏటా బీహార్ నుంచి కూలీలు వస్తుంటారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికలు ఉండటంతో ఈసారి కూలీలు ఆలస్యంగా వచ్చినా కేంద్రాల్లో సరిపోనూ బ్యాగులు లభించడం లేదు. దీంతో పాటు 35 మంది కూలీలు అందుబాటులో ఉన్నా అదనంగా తూకం మిషన్ లేకపోవడతో పనులు ముందుకు సాగడం లేదు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం కొనుగోలు సమయంలో ఎండబెట్టడం, కుప్పలు పోయడం, ప్లాస్టిక్ కవర్లకు అద్దె చెల్లించడం ఆర్థికంగా భారంగా మారుతోందని రైతులు అంటున్నారు. తూకం మిషన్ అందించే వ్యవసాయ మార్కెట్, టోకన్లు జారీ చేసే వ్యవసాయ అధికారులు, బ్యాగులు, లారీలు పంపించే పౌర సరఫరా శాఖ అధికారులు, ధాన్యం కొనుగోలు చేసే డీసీఎంఎస్ అధికారుల సమన్వయ లోపంతోనే కొనుగోలు ముందుకు సాగడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బ్యాగులు అందజేయాలి



కేంద్రంలో బ్యాగుల కొరత వేధిస్తోంది. 20 రోజులుగా కేంద్రంలోనే ధాన్యం కుప్పలుగా మూలుగుతోంది. వర్షంలో తడిసిన ధాన్యం ఆరబెట్టడానికి ఇబ్బందిగా మారింది. రైతులను ఇబ్బందులు పెట్టకుండా వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలి.

– రమేశ్, రైతు, ఎదులాబాద్

టోకన్ ఇవ్వడం లేదు



ధాన్యం ఎండబెట్టి 20 రోజులు అవుతోంది. టోకన్ ఇవ్వడం లేదు. ముందు టోకన్లు పొందిన రైతుల ధాన్యం కొనుగోలు అనంతరం కొనుగోలు చేస్తామంటున్నారు. వర్షంతో చేతికందక ముందే చెడిపోయే అవకాశముంది. వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలి.

– సత్యనారాయణ, రైతు ఎదులాబాద్

రైతులను మోసం చేస్తూ..



రైతులకు మెరుగైన సేవలందిస్తామన్న ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోంది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో బ్యాగుల కొరత వేధిస్తోంది. రైతులు పండించిన ధాన్యం మొత్తాన్ని వెంటనే కొనుగోలు చేయాలి.

– బొక్క కష్టారెడ్డి, బొక్కనిగూడ

ఆటో దొంగ అరెస్టు

పోచారం: ఇంటి ముందు పార్క్ చేసిన ఆటోను దొంగిలించిన వ్యక్తిని పోచారం పోలీసులు శనివారం అరెస్టు చేశారు. సీఐ రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘనాపూర్‌లోని ఇందిరానగర్‌లో బద్రయ్య ఈ నెల 12న తన ఇంటి వద్ద ఆటోను పార్క్ చేసి నిద్రపోయాడు. అదేరోజు రాత్రి అన్నోజిగూడలోని రాజీవ్ గృహకల్పకు చెందిన నలుగురోల్లు సాయికుమార్(25) డూప్లికేట్ తాళం చెవితో ఆటోను దొంగిలించి నగరంలో అమ్మేందుకు ప్రయత్నించాడు. సరైన పత్రాలు లేకపోవడంతో ఆటోను ఎవరూ కొనలేదు. అతను అదే వాహనాన్ని విక్రయించేందుకు శనివారం యాదగిరిగుట్ట వైపు తీసుకెళ్తుండగా యంనంపేట్ చౌరస్తా వద్ద పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు ఆటోను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

వృద్ధురాలి మెడలోని గొలుసు చోరీ



రాములమ్మ

కీసర: వృద్ధురాలి మెడలోంచి గుర్తుతెలియని దుండగులు మంగళ సూత్రం ఎత్తుకెళ్లారు. ఈ ఘటన శనివారం అంకిరెడ్డిపల్లిలో చోటుచేసుకుంది. కీసర సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం వృద్ధురాలైన జెల్ల రాములమ్మ తన ఇంటి ముందు ఒంటరిగా కూర్చొని ఉండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలోని నాలుగు తులాల బంగారు మంగళ సూత్రాన్ని ఎత్తుకెళ్లారు. వృద్ధురాలికి మతిస్థిమితం సరిగా లేకపోవడంతో తెలిసిన వారే ఈ పనికి పాల్పడి ఉంటారని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ మేరకు విషయం తెలుసుకున్న కీసర పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కీసర: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. కీసర సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం నాగారం మున్సిపాలిటీలోని రాంపల్లి డంపింగ్ యార్డు సమీపంలో గల క్వారీ వద్ద రాళ్ల మధ్యలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించిందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సుమారు 55 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉన్న మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైల్వే వంతెన పనులు పూర్తి చేయించాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య, యాదగిరియాదవ్, రాధాకృష్ణ

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ రైల్వే వంతెన పనులు పూర్తి చేయించాలని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య, కాంగ్రెస్ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్ యాదవ్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. వంతెన రోడ్డు బాధితులకు పరిహారం అందజేయాలని, కాంట్రాక్టర్‌కు పెండింగ్ బిల్లులు త్వరగా చెల్లింపు జరిగేలా ఆర్థిక మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని లేఖలో కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదగిరి యాదవ్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్, కౌన్సిలర్లు మల్లేశ్, రవీందర్, రాధాకృష్ణ ముదిరాజ్, అంజిరెడ్డి, దేవేందర్‌ముదిరాజ్, చిత్తారి యాదవ్, ఆంజనేయులు, శశిధరన్, ఆంజనేయులుయాదవ్, శివప్రదీప్‌రెడ్డి, సంజీవరెడ్డి, జంగయ్యయాదవ్, రఫీయుద్దీన్, ఫరూక్, సిరాజ్, ఖయూమ్, శ్రీనివాస్‌గౌడ్, సురేశ్ పాల్గొన్నారు.

ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఈ నెల 24 నుంచి వచ్చేనెల 3 వరకు జరిగే ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు. ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలపై శనివారం నిర్వహించిన సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి వచ్చే నెల 3 వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షల కోసం సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. మేడ్చల్ జిల్లాలో 50,443 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారని, వీరి కోసం 89 సెంటర్లు ఉన్నాయని, అందులో మొదటి సంవత్సరంలో 36,940 మంది, ద్వితీయ సంవత్సరంలో 13,503 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని ఆయన తెలిపారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. పరీక్షా కేంద్రాలకు నిరంతరం విద్యుత్ సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేయాలని విద్యాశాఖ అధికారులను కోరారు. మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వంటి వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని డీఎం అండ్ హెచ్‌వోకి ఆదేశాలు జారీ చేశారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థుల కోసం ప్రతిరోజూ తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. విద్యార్థులకు బస్సులను అందుబాటులో ఉంచాలని టీఎస్ఆర్టీసీని కోరారు. ప్రతి పరీక్షా కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్‌ను నియమించినట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ బోర్డు అధికారి కిషన్, ఏసీపీ చంద్రకుమార్, సత్యనారాయణ, విద్యుత్ శాఖ అధికారి సతీష్, పోస్టల్ అధికారి సంపత్‌రెడ్డి అధికారులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్‌లో రహదారులు జలమయం



శ్రీలక్ష్మీనర్సింహ కాలనీ రహదారి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో శనివారం సాయంత్రం ఈదురు గాలులతో కురిసిన వర్షానికి పలు కాలనీల్లోని రహదారులు జలమయం అయ్యాయి. శ్రీలక్ష్మీనర్సింహస్వామి కాలనీ జలమయం కావడంతో స్థానిక ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని, కాలనీలో విద్యుత్ సరఫరా సరిగ్గా ఉండదని, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అభివృద్ధి పనులు చేస్తామని ఎన్నికల ముందు హామీలు ఇచ్చిన ప్రజాప్రతినిధులు ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్న వర్షానికే కాలనీ అంతా బురదమయంగా మారిందని, ఇళ్లలో నుంచి బయటకు రాలేకపోతున్నామని, వర్షాకాలం వస్తే ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆరాధన మహోత్సవం



మేడ్చల్: మేడ్చల్ పట్టణంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శనివారం ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయంలోని వేద పండితులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి పల్లకీ సేవలో భక్తులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో ఆలయ కమిటీ అధ్యక్షులు విష్ణుచారి, సభ్యులు వెంకటేశం, సురేశ్, రవిశంకర్, శేఖర్, వీరాచారి భక్తులు పాల్గొన్నారు.

ఎగిరిపోయారు..

- అవిశ్వాసం పెట్టే యోచనలో చైర్మన్ వ్యతిరేక వర్గం
- బ్యాంకాక్ బాట పట్టిన మున్సిపల్ కౌన్సిలర్లు



బ్యాంకాక్ టూర్‌కు బయలుదేరిన చైర్మన్ భర్త, తన వర్గం కౌన్సిలర్లు



గుండ్లపోచంపల్లి మున్సిపల్ కార్యాలయం

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన కౌన్సిలర్లు బ్యాంకాక్ బాట పట్టారు. మున్సిపల్ చైర్మన్ పదవికి అవిశ్వాస గండం మెండుగా మారడంతో సదరు మున్సిపల్ చైర్‌పర్సన్ తన వర్గం కౌన్సిలర్లను మరోమారు విదేశీ యాత్రకు తీసుకెళ్లి బుజ్జగించే ప్రయత్నాలు మొదలు పెట్టింది. దీంతో శుక్రవారం రాత్రి చైర్ పర్సన్ భర్త మద్దుల శ్రీనివాస్‌రెడ్డి తమవర్గం కౌన్సిలర్లను బ్యాంకాక్ టూర్‌కు తీసుకెళ్లారు.

అవిశ్వాసం గండం తప్పదా..?

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో మొత్తం 15 వార్డులు ఉండగా ఒకరు కాంగ్రెస్, ఇద్దరు బీజేపీ నుంచి గెలుపొందగా మిగిలిన 12 మంది బీఆర్ఎస్ వారే గెలుపొందారు. నాడు బీఆర్ఎస్ అధికారంలో ఉండటంతో పాటు ప్రస్తుత మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మంత్రిగా కొనసాగడంతో తన బావమరిది అయిన మద్దుల శ్రీనివాస్‌రెడ్డి భార్య మద్దుల లక్ష్మికి చైర్మన్ పదవి కట్టబెట్టారు. దీంతో వారు ఆడిందే ఆట అన్నట్లు వ్యవహారం నడిచింది. కౌన్సిలర్లు అసమ్మతికి గురైన సమయంలో మల్లారెడ్డి బుజ్జగించడం, ఆయన సూచనలతో చైర్మన్ భర్త వారిని విదేశీ యాత్రకు తీసుకెళ్లి శాంతింపజేయడం జరిగింది. కానీ ప్రస్తుతం అందుకు భిన్నంగా మున్సిపల్ రాజకీయం నడుస్తోంది.

కాంగ్రెస్ గూటికి చేరి..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం.. బీఆర్ఎస్‌కు చెందిన అసమ్మతి కౌన్సిలర్లు పలువురు కాంగ్రెస్, బీజేపీలో చేరడం, మున్సిపల్ వైస్ చైర్మన్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడంతో అవిశ్వాస గండం తప్పదనే చర్చ కొనసాగుతోంది. దీనికి తోడు మేడ్చల్ మున్సిపాలిటీలో ఇటీవల బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ గూటికి చేరి చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టడంతో ఇక తమ వంతే అన్నట్లు గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో రాజకీయం జోరందుకుంది.

బీఆర్ఎస్ కౌన్సిలర్లతో కాంగ్రెస్ వైస్ చైర్మన్..

అవిశ్వాసం నుంచి తప్పించుకునేందుకు తన వర్గం వారిని బ్యాంకాక్ టూర్‌కు తీసుకెళ్లే ప్లాన్ చేసి వారితో శుక్రవారం రాత్రి విమానం ఎక్కగా వారితో పాటు ఇటీవల కాంగ్రెస్ కండువా కప్పుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్ ఉండటంతో చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం టూర్ వెళ్లిన వారిలో ముగ్గురు కౌన్సిలర్లు, ఒకరు కో ఆప్షన్ సభ్యుడు, మరో కౌన్సిలర్, కో ఆప్షన్ భర్తతో పాటు చైర్‌పర్సన్ భర్త శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ వైస్ చైర్మన్ ప్రభాకర్ మొత్తం 8 మంది ఉన్నారు. మరో కౌన్సిలర్ చైర్మన్ వర్గంలోనే కొనసాగుతున్నారు. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన వైస్ చైర్మన్ ప్రభాకర్, చైర్మన్ వర్గంలో టూర్‌కు వెళ్లడం చర్చగా మారగా వారి ప్లాన్‌ను తెలుసుకునేందుకే వెళ్లాడా లేక పార్టీ మారినా చైర్మన్‌కే తమ మద్దతు పలికేందుకు వెళ్లాడా అనే ప్రచారం జోరుగా సాగుతోంది.

కాంగ్రెస్, బీజేపీ ఏకమయ్యేనా..?

గుండ్లపోచంపల్లి మున్సిపల్ పీఠం నుంచి బీఆర్ఎస్ చైర్మన్‌ను దించేందుకు కాంగ్రెస్, బీజేపీ ఒక్కటవుతాయా అనే సంకేతాలు కనబడుతున్నాయి. ఎమ్మెల్యే మల్లారెడ్డికి రాజకీయంగా చుక్కలు చూపించాలని కాంగ్రెస్ నియోజకవర్గ ముఖ్య నేతలు యోచిస్తుండగా, బీజేపీ మున్సిపల్‌లో తమ బలాన్ని పెంచుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఇందుకోసం రెండు పార్టీలు ఏకమై బీఆర్ఎస్ చైర్మన్‌ను గద్దె దించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. వీరి అవిశ్వాసం పుణ్యామాని చైర్మన్ వర్గం కౌన్సిలర్లు మాత్రం విదేశీ టూర్లు, విలాసవంతమైన జీవితం గడుపుతూ ఎంజాయ్ చేస్తున్నారు.

ఎమ్మెల్యే మల్లారెడ్డికి చుక్కలు చూపించాలనే..

ఇప్పటికే బీఆర్ఎస్‌కు చెందిన ఇద్దరు కౌన్సిలర్లు బీజేపీలో చేరగా మరో ఇద్దరు కౌన్సిలర్లు, ఓ కో ఆప్షన్ సభ్యుడు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో 15 మంది కౌన్సిలర్లలో బీఆర్ఎస్‌లో 8 మంది కొనసాగుతుండగా, బీజేపీ, కాంగ్రెస్‌లో నలుగురు చొప్పున ఉన్నారు. కో ఆప్షన్లు నలుగురికిగాను బీఆర్ఎస్, కాంగ్రెస్‌లో ఇద్దరిద్దరు ఉన్నారు. మరోవైపు ఎమ్మెల్యే మల్లారెడ్డికి చుక్కలు చూపించాలనే యోచనలో ఉన్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పట్టుబట్టి కౌన్సిలర్లను తమ పార్టీలో చేర్చుకుంటూ అవిశ్వాస తీర్మానాలకు తెరలేపడంతో తమకు అవిశ్వాసం తప్పదని చైర్మన్ వర్గం యోచిస్తోంది.